క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాల దరఖాస్తుకు నేడు ఆఖరి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌తో పాటు రాష్ట్రంలో పలు చోట్ల ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని హుజూర్‌నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం దరఖాస్తుకు చివరి తేదీ అని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ప్రభుత్వ ఆర్థికసాయం


మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మునగాల : మండలంలోని గణపవరం వీఆర్‌ఏ మారిశెట్టి నాగేశ్వరరావు (63) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బుధవారం మునగాల మండల ఆర్‌ఐ రామారావు, రెవెన్యూ సిబ్బంది సంజీవరావు, శంకర్ తదితరులు నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.పదివేల చెక్కును మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మాజీ ఎంపీటీసీ అమరబోయిన మట్టయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీలు పంపిణీ

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బుధవారం తెలుగు, ఇంగ్లిష్ డిక్షనరీలను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు డిక్షనరీల ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేణుక, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవికృష్ణ, గ్రంథాలయాధికారి నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఐపీడీఎస్ ట్రాన్స్‌ఫార్మర్ చార్జ్ చేస్తున్నందున గురువారం పట్టణంలోని లింగగిరి రోడ్డు, గాంధీ పార్క్, రెడ్డి బజార్, అంబేడ్కర్ కాలనీ, తిలక్‌నగర్, శ్రీనగర్ కాలనీ ఎన్నెస్పీ క్యాంప్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థుల ఫీజుల చెల్లింపు


విద్యార్థులతో ఏహెచ్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడులో గల అరుణోదయ పాఠశాల విద్యార్థులు 45 మందికి ఏహెచ్‌ఆర్ ఫౌండేషన్ తరఫున రూ.2 లక్షల 94 వేల స్కూల్ ఫీజులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి నిత్యావసర సరుకులు అందజేత


నిత్యావసర సరుకులు, బియ్యం అందజేస్తున్న నాగుల్‌మీరా

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లికి చెందిన నిరుపేద దివ్యాంగుడు పొట్టిపంగు నరసింహారావు ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతుండటంతో బుధవారం స్థానికుడు నాగుల్‌మీరా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. దీంతో పలువురు నాగుల్‌మీరాను అభినందించారు.

వాహనాల వేలం రద్దు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించాల్సిన వేలం పాట రద్దు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వేలం వాయిదా వేశామని కోడ్ ముగిసిన తర్వాత వేలం పాట ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ మెస్ చార్జీలు చెల్లించాలి

గరిడేపల్లి : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల మెస్ చార్జీలు వెంటనే చెల్లించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. హాస్టల్ విద్యార్థులకు 10 నెలల మెస్ చార్జీల బకాయిలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని కోరారు.

వైభవంగా రామాలయ పునఃప్రతిష్ఠ




ప్రత్యేక అలంకారంలో సీతాలక్ష్మణసమేత శ్రీరాముడు, వేంకటేశ్వరస్వామి, రాధాకృష్ణులు


స్వామివార్లను దర్శించుకుంటున్న భక్తులు

- దేవానంద జీయర్‌స్వామి నేతృత్వంలో మూలమూర్తుల ప్రాణప్రతిష్ఠ
- స్వామివార్లకు మహాకుంభాభిషేకం, సంప్రోక్షణ, మహాపూర్ణాహుతి
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం
- ఏడుచోట్ల భక్తులకు అన్నదానం

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో శ్రీకోదండ రామాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవానంద జీయర్‌స్వామి నేతృత్వంలో రామాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం 10.02 గంటలకు సర్వదేవతా మూర్తులకు ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. అనంతరం రుత్వికులు.. సంప్రోక్షణ, మహాకుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, గర్భాలయ ప్రవేశం గావించారు. ఆలయంలో సీతా,లక్ష్మణ సమేత కోదండరాముడు, అన్నపూర్ణ సమేత బోలా లింగేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి, రాధాకృష్ణులు, ఆళ్వారులతో పాటు ఆంజనేయస్వామి, వాసవి,


విగ్రహాల ప్రాణప్రతిష్ఠాపనోత్సవంలో ప్రవచనాలు చెపుతున్న దేవానంద జీయర్‌స్వామి

కన్యకాపరమేశ్వరి అమ్మవారుల ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అదేవిధంగా ఆలయ ఆవరణలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం సంప్రోక్షణ, పుష్పాలంకరణ తరువాత భక్తులకు స్వామివార్ల దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివార్లకు పూజలు చేశారు.

ఏడుచోట్ల భక్తులకు అన్నదానం..

కాగా, పట్టణంలో ఏడు చోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 80వేల మందికి అన్నదాన వితరణ చేశారు. ఉత్సవాల్లో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు నాగుబండి రంగా, నాగుబండి లక్ష్మయ్య, నాగుబండి రంగనాథ్, నాగుబండి నందగోపాల్, పట్టణ ప్రముఖులు పాండురంగారావు, లక్ష్మీనారాయణరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు. కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐ టి.రాము భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

శ్రీకోదండరామాలయంలో మూలమూర్తులను కోదాడ పీడీఎం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్యాంసుందర్, పీడీఎం కోర్టు జడ్జి భవ్యలు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రుత్వికులు వారికి ఆశీర్వాదం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అదేవిధంగా సీనియర్ న్యాయవాది కేఎల్‌ఎన్ ప్రసాద్ కూడా దేవతామూర్తులను దర్శించుకున్నారు.


స్వామివార్ల దర్శనానికి ఆలయ ప్రాంగణంలో క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తజనం


ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ప్రముఖులు


స్వామివారిని దర్శించుకుని వస్తున్న జడ్జిలు శ్యాంసుందర్, భవ్య

ఘనంగా ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపనోత్సవం

మునగాల : మండలంలోని కొక్కిరేణిలో శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి, శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ధ్వజస్తంభాలకు జలాభిషేకం చేసి పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాలను వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రతిష్ఠించారు. తదనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామానికి ఆడపడుచులు రావడంతో పండుగ వాతావరణం నెలకొన్నది.


కొక్కిరేణిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి

నడిగూడెం : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి కోరారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ గెలుపు కోసం గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరిపై కేసు

మేళ్లచెరువు : ఒకరిపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన ఇద్దరిపై బుధవారం మేళ్లచెరువు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన గోపిశెట్టి శంకర్, మణి ఆర్థిక లావా దేవీల దృష్ట్యా మంగళవారం రాత్రి శివాలయం పరిధిలో చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన శంషద్‌పై గొడ్డలితో దాడి చేశారు. అతడి తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు వెంటనే 108లో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కోదాడ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గాయపరచిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి వినతి


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట): రాష్ట్రంలోని పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్. సీతారామయ్య, ఎస్ సుదర్శన్‌రెడ్డి, జి. వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం


చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి చెన్నకేశవస్వామి దేవాలయంలో బుధవారం అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యజ్ఞాచార్యులు మరింగంటి వరదాచార్యులు ఆధ్వర్యంలో తొలక్కం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజబాబురెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త ఉమ్మెంతల హరిప్రసాదరావు, అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు, డైరెక్టర్లు చెరుకుపల్లి కృష్ణయ్య, మంగపండ్ల మల్లికార్జున్, కుమ్మరికుంట్ల జానయ్య, సైదమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అర్వపల్లి: ఎన్నికల కోడ్‌ను ప్రతిఒక్కరూ తప్పకుండా పాటించాలని అర్వపల్లి ఎస్‌ఐ ఎస్‌కే యాకూబ్ సూచించారు. అర్వపల్లిలో వై-జంక్షన్ వద్ద బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ మొత్తాన్ని వెంట తీసుకెళ్లరాదని ఎస్‌ఐ చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గిన తర్వాత ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. తిరుమలగిరి మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళితబంధులో కోట్ల రూపాయలు చేతులు మారాయని, దళితు బంధు పథకంపై విచారణ చేయాలని అసెంబ్లీలో సైతం మాట్లాడానని, దీనిపై జ్యూడీషియల్ ఎంక్వైరీ చేయించి బాధితులకు న్యాయం చేస్తానని అన్నారు. అనంతరం కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై. నరేష్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 4 కోట్లకు ఐపీ దాఖలు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు చిట్టీల వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి ఏకంగా రూ.4 కోట్లకు పైచిలుకు ఐపీ దాఖలు చేసిన విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో సుమారు 70 మంది బాధితులు లబోదిబోమంటున్నారని తెలిసింది. సదరు వ్యక్తి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ బక్కమంతులగూడెం, చౌటపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు, వ్యాపారస్తుల వద్ద సుమారు రూ.4 కోట్లకు పైగా పైకాన్ని వడ్డీలకు తీసుకున్నట్లు సమాచారం. కాగా బాధితులు మధ్యవర్తుల ద్వారా పైకాన్ని పొందేందుకు ప్రయత్నాలు చేస్తుండగా సదరు ఐపీ దాఖలు చేసిన వ్యక్తి గ్రామంలో లేకుండా వెళ్లినట్లు తెలిసింది.

24 వైద్య శిబిరం

మఠంపల్లి : మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త చర్చి ఆవరణలో ఈనెల 24వ తేదీన స్థానిక శుభోదయ యూత్, ఫాదర్ మార్టిస్, చర్చి పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఉచిత మహిళా వైద్య శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మఠంపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సంయుక్తారెడ్డి తన తండ్రి డా.టీఎస్‌రెడ్డి జ్ఞాపకార్థం మహిళలకు సంబంధించిన సంతాన్య సాఫల్యతకు ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు.

గోపయ్య, తిరుపతమ్మకు పూజలు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నడిగూడెం : మండలంలోని వేణుగోపాలపురంలో బుధవారం శ్రీ గోపయ్య, తిరుపతమ్మల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, వేదపారాయణం, ఆదివాసహనములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మత్స్య సొసైటీ ఎన్నికలు


పోలింగ్ నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది

మఠంపల్లి : మఠంపల్లిలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. సంఘంలో మొత్తం 280 మంది సభ్యులున్నారు. కాగా, 9 డైరెక్టర్ పదవులకు 24 మంది సభ్యులు పోటీపడ్డారు. వారిలో అత్యధిక ఓట్లు సాధించిన తవిడబోయిన నాగేశ్వరరావు, చింతల లక్ష్మీనారాయణ, చింతల వీరబాబు, చాగంటి నరసింహారావు, తుంగం వీరయ్య, తవిడబోయిన వీరయ్య, తవిడబోయిన కృష్ణ, కర్నె సైదమ్మ, బుద్ధి సక్కుబాయమ్మలు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన అశోక్‌కుమార్ గెలుపు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కాగా, ఈనెల 21న స్థానికంగా డైరెక్టర్లు సమావేశమై పాలకవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మఠంపల్లి ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గాలికుంటు వ్యాధిని సమూలంగా నివారించాలి

- పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.పెంటయ్య


మునగాలలో గాలికుంటు వ్యాధి నివారణ వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న పెంటయ్య

మునగాల : పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని సమూలంగా నివారించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య అన్నారు. మునగాల మండల కేంద్రంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ శిబిరాన్ని ఆయన బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ మండలంలో టీకాల నిర్వహణ మందకొడిగా సాగుతుందని తెలిపారు. సిబ్బంది తక్షణమే స్పందించి మండల వ్యాప్తంగా ఉన్న పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడాన్ని ముమ్మరం చేసి పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామాలలోని అందరూ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పాల యూనియన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డా.ఇ.భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీలకు ఉచిత మీటర్లు ఇవ్వాలి


చిలుకూరులో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెమిడాల రాజు

చిలుకూరు : మండలంలోని ఎస్సీ కాలనీవాసులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి, వారికి ఫ్రీ కరెంట్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెమిడాల రాజు అన్నారు. బుధవారం చిలుకూరులోని సీపీఐ భవనలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ కాలనీవాసులకు ఎప్పటి నుంచో ఉచిత కరెంట్ అని చెబుతున్నారని కానీ అధికారులు మాత్రం విద్యుత్ మీటర్లు లేవని వారిపై కేసులు రాయడం, జరిమానాలు వేయడం, డెవలప్‌మెంట్ పేరుతో డబ్బులు వసులు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఎస్సీ కాలనీవాసులకు విద్యుత్ మీటర్లు, ఉచిత కరెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మౌలానా, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రేపాలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


సిరిపురం నుంచి స్వామివారిని ఆలయానికి తీసుకొస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

మునగాల : రాష్ట్రంలో రెండవ యాదగిరిగుట్టగా పేరొందిన మునగాల మండలంలోని రేపాల గ్రామ శివారులో గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పదిరోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని నడిగూడెం మండలం సిరిపురం గ్రామం నుంచి రేపాల గుట్టపై ఆలయానికి కోలాట ప్రదర్శనతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సారిక చిన రామయ్య, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు చివలూరి రామకృష్ణాచార్యులు, గ్రామపెద్దలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

కేంద్రంలో మూడోసారి బీజేపీదే అధికారం

- బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్


తిరుమలగిరి: మాట్లాడుతున్న బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

తిరుమలగిరి (తుంగతుర్తి): కేంద్రంలో మూడోసారి కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం తిరుమలగిరిలో బీజేపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి మచ్చలేని నిస్వార్థ నాయకుడని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలిచి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో తాను భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు రూ.9వేల కోట్లతో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. రూ.1400 కోట్లతో బీబీనగర్‌లో ఎయిమ్స్, భువనగిరిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషిచేశానని వివరించారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు ఎక్కువ బీజేపీ ప్రభుత్వమే ఇచ్చిందని, దేశ ప్రజలందరికీ ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తుందని అన్నారు. పార్టీలకతీతంగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. అవినీతిమయమైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడెం రామచంద్రయ్య, బండారు లింగస్వామి, కాప రవికుమార్, వై. దీన్‌దయాళ్, యాదగిరి, కూరాకుల వెంకన్న, మూల వెంకట్‌రెడ్డి, స్వామి యాదవ్, కందుకూరి సోమయ్య, సుభాష్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభయ హస్తం.. బస్మాసుర హస్తమే

తుంగతుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభయ హస్తం పథకం బస్మాసుర హస్తమేనని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలో వారు బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబు, నాయకులు కాప రవి, లింగస్వామి, దాయం ఝాన్సీరెడ్డి, నరసింహారెడ్డి, అంజయ్య, సైదులు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా 'భగీరథ' ట్యాంకులు

- గ్రామాల్లో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. మండల వ్యాప్తంగా ఉన్న 29 ట్యాంకులలో సగానికి పైగా ట్యాంక్‌లు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయి. జెర్రిపోతులగూడెంలో ఒక్క ట్యాంకుకు కూడా నీళ్ల రావడం లేదు. అలాగే చిలుకూరులో రెండు ట్యాంకులకు, మాధవగూడెంలో ఒక ట్యాంకులు, బేతవోలులో మూడు ట్యాంకులకు నీటి సరఫరా లేదు. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి. ట్యాంకులు నిరుపయోగంగా ఉండడంతో పాటు పలు గ్రామాలల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ల లీకేజ్ సమస్యతో ప్రజలకు నీరు అందడం లేదు. దీంతో గ్రామాల్లో తాగు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలం ఇంకా పూర్తిగా రాకముందే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే రెండు నెలలు నీరెలా అని ప్రజలు అంటున్నారు. ఇక గ్రామాలకు మంచి నీటి సరఫరా చేసే గ్రామ కార్యదర్శులు మిషన్ భగీరథ నీటి సరఫరా తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్ల సక్రమంగా రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఏఈ నాగరాజును వివరణ కోరగా సాధ్యమైనంత వరకు ట్యాంకులు పని చేసేలా చూస్తామని, ఇంటింటికీ భగీరథ నీళ్లు అందేలా చేస్తామని తెలిపారు.


చిలుకూరులో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్


జెర్రిపోతులగూడెంలో..